క్లుప్తంగా

విజయ డెయిరీ డైరెక్టర్ ఎన్నిక



డైరెక్టర్‌కు పలువురి అభినందన

నెల్లూరు(సెంట్రల్) : విజయ డెయిరీలో ఖాళీగా ఉన్న ఒక డైరెక్టర్ పదవికి కోడూరు శ్రీనివాసులురెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మేరకు నగరంలోని విజయ డెయిరీలో శనివారం జరిగిన పాలకవర్గ సమావేశంలో వరిగొండ పాల సొసైటీ అధ్యక్షుడు కోడూరు శ్రీనివాసులురెడ్డిని ఎన్నుకున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డితో పాటు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సత్కారం



నెల్లూరురూరల్ : బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన వంశీధర్‌రెడ్డిని జనతా ఫౌండేషన్ చైర్మన్ దాసరి ప్రసాద్ ఆధ్వర్యంలో సన్మానించారు. నగరంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో ఈ మేరకు శనివారం సత్కరించారు. జనతా ఫౌండేషన్ సభ్యులు పులి మనోజ్, నర్సింహ, రాజా ఆదిత్య పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం



నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని ఎన్జీఓ అసోసియేషన్ కల్యాణ మండపంలో జిల్లా విద్యుత్ రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ సంఘ సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 30 మంది రిటైర్డ్ విద్యుత్ ఉద్యోగులను సన్మానించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్‌ఈ విజయన్ మాట్లాడుతూ, రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టౌన్ ఈఈ శ్రీధర్‌తో పాటు అనిల్‌కుమార్, శివప్రసాద్, కృష్ణప్రసాద్, ప్రభావతి, బాలచంద్ర, సంపత్‌కుమార్, చంద్రశేఖర్, కుప్పుస్వామి పాల్గొన్నారు.

కియా సిరోస్ కారు విడుదల



నెల్లూరు (టౌన్) : స్థానిక హోషి ఆటో ప్రైవేట్ లిమిటెడ్ కియా కారు షోరూమ్‌లో శనివారం కియా సిరోస్ కారును మార్కెట్లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా షోరూమ్ మేనేజింగ్ డైరెక్టర్ సి.జగన్నాథరెడ్డి మాట్లాడుతూ కియా సిరోస్ కారులో అత్యాధునిక సదుపాయాలు ఉన్నాయన్నారు. స్టాండర్డ్ సేఫ్టీ ప్యాక్, డ్యూయల్ పాన్ పానరోమిక్ సన్‌రూఫ్ తదితర సదుపాయాలు ఉన్నాయన్నారు. కారు బుకింగ్‌కు 86888 29718 నంబర్‌ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు నిరంజన్, భారతి, హోషిమారెడ్డి, షోరూమ్ మేనేజర్ శ్రీనివాసులు, జనరల్ మేనేజర్ సతీష్‌బాబు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు సర్వం సిద్ధం



విద్యుద్దీపకాంతుల్లో కలెక్టరేట్



ముస్తాబైన పరేడ్ గ్రౌండ్

నెల్లూరురూరల్ : గణతంత్ర దినోత్సవ వేడుకలకు జిల్లా కలెక్టరేట్, పోలీస్ పరేడ్ మైదానంతో పాటు ప్రభుత్వ కార్యాలయాలు ముస్తాబయ్యాయి. పోలీస్ పరేడ్ మైదానంలో ఆదివారం జరుగనున్న రిపబ్లిక్ డే వేడుకలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 9 గంటలకు కలెక్టర్ ఆనంద్ జాతీయ పతాకాన్ని ఎగురవేయనున్నారు. విశిష్ట సేవలు అందించిన ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బందికి కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారాలు అందించనున్నారు. అనంతరం ప్రజలనుద్దేసించి ప్రసంగిస్తారు. తదుపరి విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తారు. విద్యుత్‌శాఖ, అగ్నిమాపక శాఖల అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో తాగునీరు, శానిటేషన్, మరుగుదొడ్ల ఏర్పాట్లను పూర్తి చేశారు. ఎవరికీ ఇబ్బందులు లేకుండా గణతంత్ర వేడుకలకు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. అలాగే కలెక్టరేట్‌లో నిర్వహించే రిపబ్లిక్ డే వేడుకల్లో జాయింట్ కలెక్టర్ కార్తీక్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు.





పోలీస్ కవాతు మైదానంలో చేసిన ప్రత్యేక ఏర్పాట్లు

పాఠశాలల్లో పరిస్థితులపై సర్వే



చింతారెడ్డిపాళెంలోని ఉన్నత పాఠశాలలో మాట్లాడుతున్న ఆర్డీఓ అనూష

నెల్లూరు సిటీ : పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య, వసతులు తదితర అంశాలపై సర్వే చేస్తున్నట్లు నెల్లూరు ఆర్డీఓ అనూష తెలిపారు. చింతారెడ్డిపాళెంలోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాలను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాఠశాలల్లో పరిస్థితులపై సర్వే చేస్తున్నామని తెలిపారు. పాఠశాలలు అప్‌గ్రేడ్ చేయవచ్చా, రెండు మూడు పాఠశాలల విలీనం, వసతులు తదితర అంశాలపై ఇతర శాఖల సమన్వయంతో బృందాలుగా ఏర్పడి సమాచారం తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

పథకాల అమలు సక్రమంగా ఉండాలి



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ విద్యారమ

నెల్లూరు (పొగతోట) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను సక్రమంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ విద్యారమ ఎంపీడీఓలను ఆదేశించారు. జెడ్పీ సమావేశ మందిరంలో ఎంపీడీఓలతో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో శనివారం సీఈఓ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర పథకాలు నిబంధనల ప్రకారం అర్హులందరికీ చేర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండలాల్లో నిర్వహించే సమావేశాలు సక్రమంగా నిర్వహించాలన్నారు. వివిధ పనులకు సంబంధించి మండల తీర్మానం తీసుకోవాలని, అధిక మంది సభ్యులు సూచించిన పనులను చేపట్టాలని తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ మోహన్‌రావు, వివిధ మండలాల ఎంపీడీఓలు పాల్గొన్నారు.

సమన్వయంతో విధులు నిర్వహించండి



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ సూర్యతేజ, అధికారులు

నెల్లూరు(బారకాసు) : విధి నిర్వహణలో అన్ని విభాగాల కార్యదర్శులు సమన్వయంతో వ్యవహరించి స్థానిక సమస్యలను పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ సూచించారు. పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా 36వ డివిజన్ కేవీఆర్ పెట్రోల్ బంక్, పోలీస్ పెట్రోల్ స్టేషన్ సమీపంలోని ప్రాంతాల్లో ఆయన శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలువల పూడికతీత, సిల్ట్ ఎత్తివేత పనులను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని సూచించారు. భవన నిర్మాణ సామగ్రిని రోడ్లపై డంప్ చేసి ఉన్న వారిని గుర్తించి యజమానులకు నోటీసులు జారీ చేసి జరిమానా విధించాలని ఆదేశించారు. కాలువలపై నిర్మించిన ఆక్రమణలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంజినీరింగ్ ఎస్‌ఈ రామ్మోహన్‌రావు, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చైతన్య పాల్గొన్నారు.

అలరించిన త్యాగరాజ సంగీత వైభవం



గాయని అనూషకు సన్మానం

నెల్లూరు(బృందావనం) : పుర మందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో శనివారం రాత్రి చేతన సంగీత, సాహిత్య, సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన 'శ్రీత్యాగరాజ సంగీత వైభవం' కార్యక్రమం శ్రోతలను అలరించింది. గాయని మల్లాది అనూష ఆలపించిన త్యాగరాజ కీర్తనలు రంజింపజేశాయి. ఆస్ట్రేలియాకు చెందిన (ప్రవాస భారతీయులు) చిన్నారులు షణ్ముఖ, సుముఖలు సైతం త్యాగరాజ కీర్తనలు ఆలపించారు. అనంతరం వారిని సన్మానించారు. కృష్ణపట్నం ఇమామి అగ్రోటెక్ వైస్ ప్రెసిడెంట్ ఎంవీ నారాయణమూర్తి, వివిధ రంగాలు, సంస్థలకు చెందిన ప్రతినిధులు మెట్టు రామచంద్రప్రసాద్, నలుబోలు బలరామయ్యనాయుడు, ఎ.జయప్రకాష్, గోవిందరాజు సుభద్రాదేవి, కళాంజలి అనంత్, డాక్టర్ పి.మల్లికార్జునరెడ్డి, వై.విశ్వనాథం, ఆర్.రఘు పాల్గొన్నారు. సంస్థ నిర్వాహకులు వై.శేషగిరీశం, డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు.

మర్యాదపూర్వకంగా..

నెల్లూరు(బారకాసు) : నగరంలోని రామ్‌జీ నగర్‌లో ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ నగర ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు మల్లి నిర్మల శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిజాయితీగా సేవచేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డిని రెడ్‌క్రాస్ నుంచి దూరం చేయడం ఎవరికీ సాధ్యం కాదన్నారు. నెల్లూరు రెడ్‌క్రాస్ విషయంలో పర్వతరెడ్డి విజయం అధర్మంపై ధర్మం గెలవడంతో సమానమన్నారు.

పెన్షనర్ల సర్వసభ్య సమావేశం నేడు

నెల్లూరు(బృందావనం) : బీవీనగర్‌లోని పెన్షనర్స్ సంక్షేమ భవనంలో ఆదివారం ఉదయం గణతంత్ర దినోత్సవ వేడుకలతో పాటు పెన్షనర్ల జిల్లా సర్వసభ్య సమావేశం జరుగనుందని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ఎం గౌస్, ఎస్వీవీఎస్ మూర్తి శనివారం తెలిపారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం హాజరై జాతీయ జెండాను ఆవిష్కరిస్తారన్నారు. పెన్షనర్లకు కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం సర్వసభ్య సమావేశం జరుగుతుందని, పెన్షనర్ల సమస్యలపై చర్చిస్తామని వివరించారు. జిల్లాలోని పెన్షనర్లు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

సంతపేట ఇన్‌స్పెక్టర్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న దశరథరామారావు

నెల్లూరు(క్రైమ్) : సంతపేట ఇన్‌స్పెక్టర్‌గా జి.దశరథ రామారావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు సిబ్బంది పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన ఎస్పీ జి.కృష్ణకాంత్, నగర డీఎస్పీ పి.సింధుప్రియను మర్యాదపూర్వకంగా కలిశారు. దశరథరామారావు గతంలో జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో ఎస్సైగా, సీఐగా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ స్టేషన్ పరిధిలో ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రజలు తమ ప్రాంతాల్లో చట్టవ్యతిరేక కార్యక్రమాలు, అనుమానాస్పద వ్యక్తుల సంచారం, గంజాయి, అనధికార మద్యం అక్రమ రవాణా, విక్రయాలపై డయల్ 112 లేదా 94407 00097 నంబర్‌కు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమాచారం అందించే వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

రవాణాలో ఐదుగురికి అవార్డులు

నెల్లూరు (టౌన్) : రవాణాశాఖలో ఉత్తమ సేవలందించిన ఐదుగురు అధికారులు అవార్డులకు ఎంపికయ్యారు. ఆదివారం 76వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆర్టీఓ శ్రీచందన, ఎంవీఐ ఎండీ రఫీ, ఏఎంవీఐ బి.లక్ష్మీబాయి, ఏఓ సత్యక్రాంతి, ఆఫీసు సబార్డినేటర్ రమణయ్యలు కలెక్టర్ ఆనంద్ చేతుల మీదుగా అవార్డులు అందుకోనున్నారు.

'ఆయుష్మాన్ భారత్' నిర్వీర్యమవుతోంది

నెల్లూరురూరల్ : ఆయుష్మాన్ భారత్ పథకం జిల్లాలో నిర్వీర్యం అవుతోందని బీజేపీ జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2011 జనగణన డేటా ఆధార్‌కు లింక్ ఇవ్వడం వల్ల చాలా మంది ఈకేవైసీ చేయకపోవడం, పలువురి పేర్లు లేకపోవడం, తప్పులు ఉండడం వల్ల ఆయుష్మాన్ భారత్ కార్డుల జారీలో ఆలస్యమవుతోందని తెలియజేశారు. డేటాను సరిచేయాలని అభ్యర్థించారు.

అటకెక్కిన కూటమి హామీలు



కలెక్టరేట్ వద్ద నిరసన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : కూటమి నేతలు ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చాక అటకెక్కించారని కాంగ్రెస్ పార్టీ సిటీ ఇన్‌చార్జి నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. నగరంలోని కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ నేతలు గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాల పేరుతో అబద్ధపు హామీలు ఇచ్చి రాష్ట్ర ప్రజలను మోసం చేశారన్నారు. గతంలో వైఎస్ జగన్ ఆయన చెప్పిన అన్ని పథకాలను అమలు చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో నాయకులు ఫయాజ్, శ్రీనివాసులురెడ్డి, మోహన్‌రెడ్డి, సంజయ్‌కుమార్, అల్లావుద్దీన్, నరేష్, హుస్సేన్‌బాషా, గణేష్, మల్లికార్జునరెడ్డి, కిశోర్, సుజాత, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు



నెల్లూరు సిటీ : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని స్టోన్‌హౌస్‌పేటలోని జిల్లా గ్రంథాలయంలో విద్యార్థులకు డ్రాయింగ్, వక్తృత్వ పోటీలు శనివారం నిర్వహించారు. సాంకేతిక భారత్, గ్రీన్ ఇండియా అంశాలపై వంద మంది ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పోటీలు జరిపారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బాల్ భవన్ డైరెక్టర్ సుభద్రాదేవి, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

ఓటు హక్కు అత్యంత విలువైనది



ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్పీ, పోలీస్ అధికారులు, సిబ్బంది

నెల్లూరు(క్రైమ్) : ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని ఎస్పీ జి.కృష్ణకాంత్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో జాతీయ ఓటరు దినోత్సవ వేడుకలు శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఓటర్లకు సాధికారత, భద్రత కల్పించడం ఓటరు దినోత్సవం ప్రధాన లక్ష్యమన్నారు. రాజ్యాంగం ప్రతిఒక్కరికీ కల్పించిన వజ్రాయుధం ఓటు హక్కు అన్నారు. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఓటు హక్కుపై కుటుంబ సభ్యులు, తోటి వారు, స్నేహితులకు చైతన్యం కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఏఎస్పీ సీహెచ్ సౌజన్య ఎన్నికల్లో నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకుంటామని సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ మునిరాజా, ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్, పోలీసు కార్యాలయ ఏఓ, మినిస్టీరియల్ సిబ్బంది పాల్గొన్నారు.

డీసీఓ కార్యాలయం వద్ద..



డీసీఓ కార్యాలయం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని జిల్లా సహకార శాఖాధికారి(డీసీఓ) కార్యాలయం వద్ద జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీఓ గుర్రప్ప తన సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఓటర్ల దినోత్సవం ద్వారా ప్రజలకు ఓటు హక్కు విలువ, ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ విలువలపై చైతన్యం, అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డీసీఓ కార్యాలయ సిబ్బంది, నెల్లూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోండి

నెల్లూరురూరల్ : ప్రజాస్వామ్యంలో ఓటు కేవలం హక్కు మాత్రమే కాదని, దేశ భవిష్యత్తును రూపుదిద్దే శక్తి అని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ అన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో అయన మాట్లాడుతూ మీ ఓటు హక్కు దేశానికి స్థిరమైన పాలనను అందించే విధంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో పెంచలకృష్ణ, సాయి, శివ తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శిపై చర్యలు

నెల్లూరు (పొగతోట) : నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్లకు అనుమతులు ఇచ్చిన కారణంగా పంచాయతీ కార్యదర్శిపై చర్యలకు నివేదికలు పంపారు. కోవూరు మండలం శాంతినగర్‌లో పంచాయతీ కార్యదర్శి వి.శివకుమార్ సర్వే నంబర్ 315లో 1.50 సెంట్లకు అక్రమ లేఅవుట్‌లో నిర్మాణాలకు అనుమతులిచ్చారని ఫిర్యాదులు అందడంతో అధికారులు విచారణ చేపట్టారు. దీనికి సంబంధించి క్రమశిక్షణా చర్యలు తీసుకోవాల్సిందిగా జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి నివేదికలను కమిషనర్‌కు పంపించారు.

పద్య నాటకాలు రేపు

నెల్లూరు సిటీ : బుజబుజ నెల్లూరు సాయిబాబా మందిరం వద్ద రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సోమవారం సాయంత్రం పౌరాణిక పద్య నాటకాలు నిర్వహిస్తున్నట్లు కళావేదిక చైర్మన్ కె.రమణశ్రీ శనివారం ప్రకటనలో తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి, దివంగత ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ సందర్భంగా

మావోయిస్టులపై దాడులు ఆపాలి



నెల్లూరురూరల్ : అడవుల్లో ఆదివాసీలు, మావోయిస్టులపై దాడులు ఆపి వారితో చర్చలు జరపాలని జిల్లా పౌరహక్కుల నేతలు డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఛత్తీస్‌ఘడ్, ఒడిస్సా సరిహద్దులో జరిగిన ఎన్‌కౌంటర్లలో కొన్ని మృతదేహాలు మాత్రమే లభ్యమయ్యాయని, సెంట్రల్ కమిటీ సభ్యులు జాడ తెలియాలన్నారు. వెంటనే వారితో చర్చలు ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ పి.వెంకయ్య, కేశవులు, వెంకటేశ్వర్లు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.